క్లుప్తంగా

అలీనగర్ మసీద్‌లో ఇఫ్తార్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ):46వ డివిజన్ పరిధిలోని అలీనగర్ మస్‌జిద్–ఎ– అలీ మసీదులో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి షేక్. ఆసిఫ్ పాల్గొన్నారు. షేక్.జాకీర్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆసిఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్. గౌస్‌మొహిద్దీన్, స్థానిక ముస్లిం పెద్దలు పాల్గొన్నారు. తొలుత ప్రత్యేక నమాజు చేసి అనంతరం మసీదు ఆవరణలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నాయకులు షేక్. ఆదిల్, మజ్జిద్ ఇమామ్ అబ్దుల్ కరీం, కమిటీ అధ్యక్షుడు ఎండీ. పాచ్చా సాహెబ్, ముతవల్లి ఎండీ. రషీద్, ఉపాధ్యక్షుడు హుస్సేన్ బేగ్, వైస్. సెక్రటరీ నజీర్, మౌజన అక్బర్, షేక్. షాహి, షేక్.వలీ, బాషా, ఖాజాలతో పాటు కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

కలశస్థాపనతో ఆరంభమైన జాతర మహోత్సవాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ):విశేష అభిషేకాలు, కలశస్థాపనతో నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. చిట్టినగర్ సొరంగం రోడ్డులోని శ్రీనూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చన అనంతరం కలశస్థాపన జరిగింది. 9 తేదీ అమ్మవారికి సన్నిధిలో విశేష కుంకుమార్చన నిర్వహిస్తారు. 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రోజుకో విశేష పూజ జరుగుతాయని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం అమ్మవారికి పంచ హారతుల సేవ, పూజలు నిర్వహించగా, పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

లారీ డ్రైవర్ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):లారీ డ్రైవర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. అంబాపురం పంచాయతీ పరిధిలో షేక్ ఖాదర్ బాషా, సాబీర దంపతులు నివాసం ఉంటున్నారు. ఖాదర్ బాషా లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 2వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బాషా నమాజుకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దాడి ఘటనపై....

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ఆటో డ్రైవర్, యజమానికి మధ్య చోటు చేసుకున్న వివాదంలో కర్రతో దాడికి పాల్పడిన డ్రైవర్‌పై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 98లో కుంభ నాంచారయ్య నివాసం ఉంటున్నాడు. నాంచారయ్య పెద్ది నారాయణరావు అనే వ్యక్తి వద్ద ఆటో అద్దెకు తీసుకొని జీవనం సాగిస్తుంటాడు. అయితే గత ఆరు రోజులుగా నాంచారయ్య ఆటో అద్దె కట్టడం లేదు. దీంతో ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో నారాయణరావు , నాంచారయ్య వద్దకు వచ్చి ఆటో అద్దె డబ్బులు ఇవ్వాలని అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య వివాదం చోటు చేసుకోగా, నాంచారయ్య నారాయణరావు తలపై కొట్టాడు.

అధికారికంగానే పూలే జయంతి నిర్వహించాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):గత 15 ఏళ్లుగా ప్రభుత్వమే జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహిస్తుందని, ఈ ఏడాది కూడా అధికారికంగా నిర్వహించాలని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వీ.రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 11వ తేదీన జ్యోతిరావు పూలే జయంతి కాగా ఇంత వరకు అధికారులకు ఎటువంటి ఆదేశాలు జారీ కాలేదన్నారు. ఎన్నికల కోడ్‌ను నేపథ్యంలో ఆదేశాలు జారీ కాకపోవడంతో బాధకరమన్నారు. జనాభాలో 55 శాతం మంది ఉన్న బడుగు, బలహీన వర్గాలకు జ్యోతిరావు పూలే ఆదర్శ ప్రాయులని తెలిపారు. ఆయన జయంతిని ఘనంగా నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

స్కూల్‌కు ఫ్యాన్లు అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ):గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌కు ఏబీసీడీ స్వచ్ఛంద సంస్థ అధినేత, న్యాయవాది ఆవుల వెంకటరావు, ఆయన సతీమణి లలిత కుమారి సీలింగ్ ఫ్యాన్లు వితరణ చేశారు. ఫ్యాన్లను హైస్కూల్ కరస్పాండెట్ రొంపిచర్ల సత్యనారాయణకు అందచేశారు. పేద విద్యార్థులకు అవసరమైన వసతులను కల్పించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉంటుందని వెంకటరావు తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షుడు గోపాలం, కోశాధికారి దారా నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు తరుణ్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేదరిక నిర్మూలన

షేక్ ఆసిఫ్



వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్‌ను సన్మానిస్తున్న కేశినేని శ్వేత, హైమ

విజయవాడస్పోర్ట్స్:వైఎస్సార్ సీపీ 58 నెలల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో రాష్ట్రం పేదరిక నిర్మూలన దిశగా పయనిస్తుందని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. విజయవాడలోని ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో పలువురు పార్టీ శ్రేణులతో ఆసిఫ్ సోమవారం సమావేశమయ్యారు. ఎంపీ కేశినేని నాని కుమార్తెలు శ్వేత, హైమ ఈ సందర్భంగా ఆసిఫ్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలకు వైఎస్సార్ సీపీ నిత్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. 2019లో అధికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ పేదల ఆర్థిక అభివృద్ధి కోసం పాటు పడిందన్నారు. మ్యానిఫెస్టోలోని 99 శాతం హామీలు అమలు చేసి ప్రజల ప్రేమాభిమానాలను పార్టీ సాధించిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లోనూ పార్టీ అఖండ విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. టీడీపీ మోస పూరిత పార్టీ అని కేశినేని శ్వేత, హైమ అన్నారు. నయవంచకులు, నమ్మక ద్రోహులతో టీడీపీ నిండి పోయిందని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ విజయవాడ పార్లమెంట్ కో ఆర్డినేటర్ లింగమనేని శివరామప్రసాద్, నాయకులు షేక్ అమానుల్లా, షేక్ మొహిద్దీన్, మండల శ్రీను పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్. ఆసిఫ్ కుమార్తె రేష్మ, కుమారుడు షేక్ జావిద్ 42వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అభివృద్ధి , సంక్షేమం భవిష్యత్‌లోనూ కొనసాగాలంటే వైఎస్సార్ సీపీనే గెలిపించాలన్నారు. ఎక్కడ నుంచో దిగుమతి అయిన నాయకుల మాటలు నమ్మొద్దని, పశ్చిమ నియోజకవర్గంలో సామాన్యుడైన తమ తండ్రి ఆసిఫ్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి, పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



42 వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆసిఫ్ కుమార్తె రేష్మ, కుమారుడు జావిద్

తమ్మిన స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మాజీ శాసనసభ్యుడు తమ్మిన పోతరాజు విజయవాడ నగరానికి అందించిన సేవలు అపూర్వమని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. ఆయన స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని కోరారు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత తమ్మిన పోతరాజు 42వ వర్ధంతి సోమవారం వన్‌టౌన్ లెనిన్ భవన్‌లో నిర్వహించారు. పోతరాజు చిత్రపటానికి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తమ్మిన పోతరాజు కూలి సంఘాలు, కార్మిక సంఘాలు ఏర్పాటు చేసి పాతబస్తీ, వన్‌టౌన్‌లో అంటరానితనం, అస్పృశ్యతకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. ప్రతి డివిజనులో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి యువతను చైతన్యవంతులను చేయడంతోపాటు సాంస్కృతిక పునరుజ్జీవనానికి పాటుపడ్డారని తెలిపారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన పోతరాజు కృషి వల్లే పాతబస్తీ, కొండ ప్రాంతాలు అభివృద్ధి చెందాయని వివరించారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ కనీసం సొంత ఇల్లు కూడా లేని నిస్వార్థ నాయకుడు అని కొనియాడారు. కార్యదర్శివర్గ సభ్యులు మూలి సాంబశివరావు, తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు, కార్యవర్గ సభ్యులు సింగరాజు సాంబశివరావు, తూనం వీరయ్య, మాజీ కార్పొరేటర్ కొరగంజి దుర్గాంబ, పగడికత్తుల రాము, మురిగేశన్ రాము తదితరులు పాల్గొన్నారు.

పండుగల విశిష్టతను భావి తరాలకు అందించాలి

విజయవాడ కల్చరల్: తెలుగు పండుగల విశిష్టతను భావి తరాలకు అందించాలని నవోదయ స్కూల్ మాచవరం బ్రాంచ్ ప్రిన్సిపాల్ శ్రీధరరెడ్డి అన్నారు. పాఠశాలలో సోమవారం ఉగాది, రంజాన్ పండుగల విశిష్టతను తెలియజేయడానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరంలో తొలిసారిగా జరుపుకొనే పండుగ ఉగాది అని, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని చాటేది రంజాన్ అని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ వస్త్రధారణ, పండుగ విశిష్టతను తెలియజేసే బుర్రకథ, తెలుగు శతక ధారణ, వంద శతక పద్యాలతో అవధాన కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, బాల బాలికల తల్లితండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమాలను పాఠశాల నిర్వాహకురాలు లలితారెడ్డి పర్యవేక్షించారు.



సంప్రదాయ వస్త్రధారణ కార్యక్రమంలో విద్యార్థులు

రామలింగేశ్వర స్వామికి విశేష పూజలు



రామలింగేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు



పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో సోమవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి రామలింగేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీహోమం, నిర్వహించగా, పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొని తమ నామగోత్రాలతో హోమం జరిపించుకున్నారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యంశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ నిర్వహించారు. భక్తులు, ఉభయదాతలకు ప్రసాద వితరణతో పాటు భక్తులకు అన్న ప్రసాదం అందించారు.

ఐఎన్‌టీఎస్ఓ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ ప్రతిభాన్వేషణ ఒలింపియాడ్ పరీక్ష (ఐఎన్‌టీఎస్‌ఓ) ఫలితాల్లో పటమటలంకలోని శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి తెలిపారు. తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు, వివిధ కేటగిరిల్లో బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మితో పాటు ఆ విద్యాసంస్థల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ పద్మ, డీన్ దుర్గసాయి, ప్రైమరీ ఇన్‌చార్జి ఇందిరా, ఉపాధ్యాయులు అభినందించారు.

5 శాతం రాయితీతో పన్ను చెల్లించవచ్చు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపులపై 5 శాతం రాయితీతో ఈ నెలాఖరులోపు చెల్లించవచ్చని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై ప్రభుత్వం ఇచ్చిన 5 శాతం రాయితీ గడువు ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమేనని పేర్కొన్నారు. నగరంలోని పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలోని అన్ని క్యాష్ కౌంటర్లు ఈ నెలాఖరు వరకు పని దినాలు, సెలవు దినాల్లోకూడా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని తెలియ చేశారు. పన్నులు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నరసం జాతీయ స్థాయి కవితల పోటీ విజేతలు

విజయవాడ కల్చరల్: నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం) జాతీయ స్థాయిలో ఓటరు చైతన్యం అంశంగా నిర్వహించిన కవితల పోటీ విజేతల వివరాలను సంస్థ గౌరవ అధ్యక్షురాలు తేళ్ళ అరుణ, అధ్యక్షురాలు చిన్నలక్ష్మి కళావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతిని హైదరాబాద్‌కు చెందిన వంజారి రోహిణి రాసిన కవిత మరువ బోకు, ద్వితీయ బహుతి పశ్చిమ గోదావరికి పాలకొల్లుకు చెందిన వై.శ్రీదేవి రచించిన ఓటరు గెలుపు, తృతీయ బహుమతి నిజామాబాద్‌కు చెందిన ఇక్కడ ఓట్లు అమ్ముడు బోవు, ప్రోత్సాహ బహుమతులు వైకే సంధ్యాశర్మ చిత్తూరు, కె.కవిత కర్నూలు గెలుచుకున్నట్లు తెలిపారు. వ్యక్తిగతంగా బహుమతులు ఇస్తామన్నారు.

నేడు అమరావతి కన్వెన్షన్ హాల్లో ఉగాది వేడుకలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విముదా ఇన్ ప్రా ప్రాజెక్ట్స్, లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఫైన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లయన్ డి దుర్గాప్రసాద్, డాక్టర్ రామ్ చంద్, లయన్ పి రమేష్, లయన్ అప్పారావు తెలిపారు. గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉగాదిని పురస్కరించుకుని విద్య, వైద్య, సామాజిక రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి ఉగాది పురస్కారాలు అందజేయనునట్లు తెలిపారు. బందరు రోడ్డులోని విజయకృష్ణ సూపర్ మార్కెట్ వద్ద అమరావతి కన్వెన్షన్ లో జరిగే వేడుకలకు ముఖ్య అతిథిగా నూతన హీరోయిన్ శాంతి ప్రియ (దర్శిని మూవీ ఫేమ్) హాజరవుతారని తెలిపారు. వేడుకల సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. వేడుకల వాల్ పోస్టర్‌ను శాంతి ప్రియ విడుదల చేశారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):వేసవి కాలం సందర్భంగా తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి మే 2 తేదీ వరకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ళ విద్యాకన్నా చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో స్వయం ఉపాధి కోర్సులకు సంబంధించి బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. విద్యాకన్నా మాట్లాడుతూ ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఫ్లవర్ మేకింగ్, మోహంది, హౌస్ డెకేరేటివ్ ఆర్టికల్స్, వాషింగ్ మెషిన్ లిక్విడ్స్, డిటర్జంట్స్ మేకింగ్, ఇన్‌స్టంట్ ఫుడ్ ఐటమ్స్, చాక్లెట్స్ మేకింగ్, న్యాచురల్ హెయిర్ ఆయిల్ అండ్ షాంపు తయారు చేసే కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులు జరుగుతాయన్నారు.

ఆసక్తి ఉన్న వారు ఈ నెల 14 తేదీలోగా తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866–2470420 నెంబరులో కానీ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సంస్థ ప్రోగ్రామ్ ఆఫీసర్‌తో పాటుగా ఉద్యోగులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

పోలీస్ కమిషనర్ టీకే రాణా



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ టి.కె.రాణా

విజయవాడస్పోర్ట్స్: ఇఫ్తార్ విందు మత సమరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా అన్నారు. జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎ కన్వెన్షన్ హాల్లో ఇఫ్తార్ విందు సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ రాణా మాట్లాడుతూ సర్వమతాలను గౌరవించడం మన దేశ సంప్రదాయమని తెలిపారు. అన్ని మతాలను సమానంగా ఆదరిస్తున్న మన దేశం ప్రపంచ వ్యాప్తంగా కీర్తి సాధించిందని పేర్కొన్నారు. ఆధ్యాత్మికతను సంతరించుకున్న రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని చెప్పారు. ప్రతి డీసీపీలు అధిరాజ్‌సింగ్ రాణా, కె.శ్రీనివాసరావు, టి.హరికృష్ణ, కె.చక్రవర్తి, ఉదయరాణి, రామకృష్ణ, ఏడీసీపీలు కనకరాజు, కృష్ణమూర్తినాయుడు, డి.ప్రసాద్, శ్రీహరిబాబు, కె.ఆర్.ప్రసాద్, శశికాంత్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్ల దివ్య ఆశీసులతో త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్ –(త్రైతశకం –46) జిల్లా కలెక్టరు యస్.ఢిల్లీ రావు ఆవిష్కరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ప్రతినిధులు భగవద్గీత, హిందూ సంప్రదాయాల గ్రంథాలు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఈ గ్రంథాలు ఎంతో గొప్పవని, దైవ జ్ఞానం ఉన్నవని పేర్కొన్నారు. ఈ గ్రంథాలు చదవడం ద్వారా మానవుడు కర్మ నుంచి బయట పడవచ్చన్నారు. అనంతరం త్రైత శకం తెలుగు క్యాలెండర్లను పలువురికి వితరణ చేశారు. సమితి సభ్యులు తిరుపతి మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికీ సరళమైన భాషలో అర్థం అయ్యే విధంగా రూపొందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి, హిందూ జ్ఞాన వేదిక, విజయవాడ కమిటీ అధ్యక్షుడు సభ్యులు జె.సురేష్, తిరుపతి, సత్యం, పైడప్పడు, దుర్గారావు , శంకర్ పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాంక్షిస్తూ..



తెల్లవారుజామున షెహరీ విందు స్వీకరిస్తున్న ముస్లింలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):మత సామరస్యాన్ని కాంక్షిస్తూ ముస్లింలకు సోమవారం తెల్లవారుజామున షెహరీ విందును ఏర్పాటు చేశారు. సంపర తరుణ్ ఆధ్వర్యంలో కొంత మంది యువకులు బ్రాహ్మణ వీధిలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు షెహరీని ఏర్పాటు చేశారు. సోమవారం ఉపవాస దీక్షను చేపట్టే 300 మందిని విందుకు ఆహ్వానించారు. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్‌మాసంలో ఉపవాస దీక్ష చేస్తున్న వారికి తమ వంతుగా ఈ విందును ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. తరుణ్ స్నేహితులు ఏర్పాటు చేసిన విందు పట్ల ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ముస్లిం యువకులకు ఈద్ ముబారక్‌ను తెలిపారు. లంకలపల్లి మౌళి, షేక్.బాషా, షాజిద్, అహ్మద్, మినూ, నూరుద్దీన్, దినేష్, మనోజ్, ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీ యూనివర్శిటీలో అత్యుత్తమ విద్య



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శ్రీధరన్, వెంకట వినయ్ చౌదరి, మహేంద్రనాయుడు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలో ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన మార్వాడీ యూనివర్శిటీలో చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని ఆ యూనివర్శిటీ ఫ్యాకల్టీ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ డీన్ డాక్టర్ ఆర్.శ్రీధరన్ అన్నారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఉన్న తమ యూనివర్శిటీలో అన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. లబ్బీపేటలో ఏర్పాటు చేసిన మార్వాడీ యూనివర్శిటీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యాలయాన్ని సోమవారం డాక్టర్ ఆర్ శ్రీధరన్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి కోర్సులు అందించేందుకు ముందుకు వచ్చామని తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించేందుకు యూనివర్శిటీలో బోధన, స్కిల్స్ దోహదం చేస్తాయని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్శిటీల కంటే అతి తక్కువ ఫీజులని వెల్లడించా. తమ యూనివర్శిటీలో 54 దేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. సౌత్ ఇండియా మార్కెటింగ్ ప్రతినిధి వెంకట వినయ్‌చౌదరి, ఆంధ్రా, తెలంగాణ ఇన్‌చార్జి ఎన్. మహేంద్రనాయుడు ఉన్నారు.

డాక్యుమెంట్ పోయినది

బొలిమేర అనందరావు S/o. సమూయేలు, డోరు నెం. 11-114-1, బొడ్డురాయి సెంటర్, గొల్లపూడి, విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా. నా పేరుతో యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ద్వారా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన భవానీపురం ఏరియాలో పరిమితి వారి పేట, ఇంటీరియల్ ఏరియాలో యున్నటువంటి రీ.సర్వే.నెం. 78/కిడు, మున్సిపల్ వార్డు నెం. 31/2, అసెస్మెంట్ నెం. 30305, ప్రస్తుత అసెస్మెంట్ నెం. 90681కు డోరు నెం. 78-8/7-2కు, ప్రస్తుత డోరు నెం. 78-8/7-2/1కు దాఖలా చ.గ. 385.5లు స్థిరాస్తి దస్తావేజును విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం దస్తావేజు నెం. 8454/2008గా మరియు విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం దస్తావేజు నెం. 2257/2004 దస్తావేజులు ఇల్లు మారుతుండగా పోయినవి. దొరికిన వారు అందజేయ ప్రార్థన. సెల్: 7382801557.

ట్రాక్టర్‌ను ఢీకొని గాయాలు

గన్నవరం: వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను టిప్పర్ లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ మహిళా తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని కేసరపల్లి–సావరిగూడెం మధ్య సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం... సావరిగూడెం గ్రామానికి చెందిన 30 మంది మహిళలు వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం కంకిపాడు మండలం ఉప్పులూరుకు ట్రాక్టర్‌పై బయలు దేరారు. వేగంగా వచ్చిన టిప్పర్, ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది.

శ్రీ క్రోధీ.. స్వాగతం





ఉగాది పండుగ.. షడ్రుచుల సంగమం.. ఆరు రుతువుల ఆగమనం.. ఇది మనిషి జీవిత గమనం.. నిష్క్రమిస్తున్న 'శోభకృత్'కు నిండైన వదనంతో వీడ్కోలు పలుకుతూ.. రాబోయే కాలమంతా సుఖమయం కావాలని కొత్త సంవత్సరాదిని తెలుగు లోగిలి స్వాగతం పలుకుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అండతో ప్రతి గుమ్మం అభివృద్ధి తోరణంతో.. సంక్షేమాల ముగ్గులతో.. సంతోషాల పసుపు పూసుకొని ఆహ్వానం చెబుతోంది. క్రోధి తన పేరులా కాకుండా లోకహితంగా ఉండాలని అభిలషిస్తూ పండుగ జరుపుకునేందుకు ముస్తాబైంది. ఉగాది పచ్చడిని చేసుకొని కుటుంబమంతా రుచి చూడాలని ఏర్పాట్లు చేసుకుంది. దీంతో విజయవాడ వన్‌టౌన్‌లోని కాళేశ్వరరావు మార్కెట్ కళకళలాడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ